క్లుప్తంగా

9న ఛలో విజయవాడ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 9న మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తలపెట్టిన ఛలో విజయవాడను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారం మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 44 లేబర్ కోడ్‌లను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు.

14న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 14న కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. అర్హులైన పేదలకు సాగు భూమి పంపిణీ చేసేందుకు అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించాలని కోరారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 సంవత్సరాల నుంచి అసైన్ కమిటీ సమావేశాలు నిర్వహించింది లేదన్నారు. బడాబాబులు ప్రభుత్వ భూములను ఆక్రమించినా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేణుగోపాల్, చంద్రశేఖర్, కేసీ బాదుల్లా, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గీకరణ చేస్తామని బీజేపీ మాదిగలకు ఇచ్చిన హామీని విస్మరించిందని విమర్శించారు. కురుక్షేత్ర సభలో మాదిగలపై బనాయించిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తప్పెట శివ, గురవయ్య, సుబ్బరాయుడు, బీసీ గంగులు తదితరులు పాల్గొన్నారు.

6న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్ర రాజు రాక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 6న జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో రాయలసీమలోని కడప, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ కన్వీనర్ల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రాజు కడపకు వస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి, ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మేయప్పన్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి సీట్ కేటాయించిన విద్యార్థులకు ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా, ప్రవేశాల సమన్వయకర్త డాక్టర్ ఎన్. ఆనందకుమార్‌రెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో విద్యార్థినులు ఉపయోగించిన ఫోన్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని ఆయా శాఖల్లో సీటును నిర్ధారణ చేయించుకోవాలని ఆయన సూచించారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

కడప సెవెన్‌రోడ్స్: గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి కోరారు. శుక్రవారం పంచాయితీ రాజ్ శాఖ కమిషనర్ సూర్య కుమారిని కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, వృత్తిపన్ను, రిజిస్ట్రేషన్, సర్‌చార్జి, తలసరి గ్రాంటు పన్నులను విడుదల చేయాలన్నారు.

వైవీయూలో స్వచ్ఛభారత్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సేవాపథకం యూనిట్–5 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వంగల సునీత ఆధ్వర్యంలో సర్ సీవీ రామన్ సైన్స్ బ్లాక్ ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి, ఆచార్య చంద్ర మతీశంకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప వద్దకే సంక్షేమ పథకాలు

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



దివ్యాంగుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ఏ ప్రభుత్వ కార్యాలయాలకు తిరగనవసరం లేకుండా గడప వద్దకే సంక్షేమ పథకాలను తెచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం ×గడప గడపకు మన ప్రభుత్వం₹ కార్యక్రమంలో భాగంగా 45వ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్, మారెమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా ..అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ గుల్జార్ అనే మహిళ మాట్లాడుతూ తనకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ బీమా, సున్నా వడ్డీ, పింఛన్ కానుక, వైఎస్సార్ ఆసరా, ఇంటి స్థలం ద్వారా రూ.11.72లక్షల మేలు చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. ఆర్ గంగయ్య అనే వ్యక్తి మాట్లాడుతూ తమకు వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, సున్నావడ్డీ, జగనన్న అమ్మ ఒడి, వసతి దీవెన, ఇంటి స్థలం వల్ల రూ.10.78 లక్షల లబ్ధి చేకూరిందని, గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత మేలు జరగలేదని తెలిపారు. జె. శ్రీనివాసులు అనే వ్యక్తి మాట్లాడుతూ వైఎస్సార్ వాహనమిత్ర, అమ్మ ఒడి, ఇంటి స్థం ద్వారా రూ.9.91లక్షల మేలు జరిగిందని తెలిపారు. పేదలకు సాయం చేస్తున్న ఈ ప్రభుత్వమే కలకాలం ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనివాసురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, శ్రీరంజన్‌రెడ్డి, షఫీ, బాలస్వామి రెడ్డి, పవర్ అల్తాఫ్, సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, మున్నా, పస్తం అంజి, మియ్యా పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కడప జిల్లా మహిళా పోలీస్ సంక్షేమ అసోసియేషన్ సభ్యులు కోరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాకు వారు వినతి పత్రం సమర్పించారు. అసోసియేషన్ సభ్యులు ఉమాదేవి , సౌజన్య పల్లవోలి, రేవతి గంగనపల్లె, విద్యాధరి, కమాల్ బీ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కలుగుతోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.9.16లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

– స్థానిక నాగరాజుపేట మున్సిపల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న మహమ్మద్ హకీబ్‌కు కాలేయం దెబ్బతినిందని తల్లిదండ్రులు బాబా ఫకృద్దీన్, హసీనా తెలిపారు. చెన్నైలోని బేబీ చిల్డ్రన్ కేర్‌లో చూపిస్తున్నామని, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని వైద్యులు చెప్పారని, అంత పెద్దమొత్తంలో ఖర్చు చేసే స్తోమత తమకు లేదని విన్నవించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించడానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం చేయిస్తానని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎం. సుబ్బారెడ్డి, షఫీ, అజ్మతుల్లా, జహీర్, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా రాజశేఖర్, సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పొందిన వారితో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

స్కిల్ డెవలప్‌మెంట్‌కు జవసత్వాలు



జాబ్ మేళాకు వచ్చిన యువతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవాన్ని తీసుకువచ్చిన ఘనత, స్కిల్ డెవలప్‌మెంట్‌కు జవసత్వాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే రాకను పురస్కరించుకుని ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటర్వ్యూలకు వచ్చిన యువతీ యువకులతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు మాసాల క్రితమే ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీకి కమలాపురంలో జాబ్ మేళా పెట్టాలని కోరామన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇక్కడ మెగా జాబ్ మేళా పెట్టడం, 13 పెద్ద కంపెనీలు ప్రాతినిధ్యం వహించడం హర్షణీయం అన్నారు. కాగా మేళాకు 417 మంది యువతీ యువకులు హాజరు కాగా 209 మందిని 13 కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు, డీఈఓ సురేష్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి నాగార్జున, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

ఘననివాళి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెనుబాల విజయ్‌కుమార్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి, మాజీ కౌన్సిలర్ పెనుబాల గంగరాజులు అనంతపురం జిల్లా పామిడిలో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. గంగరాజులు 1965లో మాసాపేట కౌన్సిలర్‌గా పనిచేశారు. ఈయనకు పెనుబాల విజయ్ కుమార్ ఏకైక కుమారుడు. గంగరాజులు మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. కడప మేయర్ కె. సురేష్‌బాబు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

కడప ఎడ్యుకేషన్: బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓల జీతాల చెల్లింపులో విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరి తగదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమణారెడ్డి, విజయ్‌కుమార్, వెంకటసుబ్బారెడ్డి, కొండయ్యలు పేర్కొన్నారు. జీతాల జాప్యంపై శుక్రవారం సాయంత్రం ఎస్టీయూ, యూటీఎఫ్, హెచ్‌ఎం సంఘం, బిటిఏ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కడప మహవీర్ సర్కిల్ నుంచి డీఈఓ కార్యాలయం మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు మల్లు రఘునాథరెడ్డి, గురుకుమార్, మహేష్‌బాబు, వెంకటసుబ్బయ్య, వంశీ కృష్ణ, ఇలియాస్‌బాష, రవికుమార్, నరసింహారావు, సివి రమణ, ఎజాస్ అహ్మద్, ప్రభాకర్, సంగమేశ్వరరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

– కడప డీపీటీఓ గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్ రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజరు పి. గోపాల్ రెడ్డి, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు సీతారామిరెడ్డిలు తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని ఆర్టీసీ ఆర్‌ఎం కాన్ఫరెన్సు కార్యాలయంలో డ్రైవర్లకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు డ్రంకన్ డ్రైవ్ చేయటం, సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ డ్రైవ్ చేయడం నేరమన్నారు. బస్సును సురక్షితంగా నడిపి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. బద్వేలు డిపో మేనేజరు జేఎస్ రావు మాట్లాడుతూ ప్రజల నుండి కంప్‌లెట్స్ ఎక్కువగా వస్తున్నాయని అవి రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టరు కృష్ణారెడ్డి, బద్వేలు డిపో ఎస్‌డిఐ బీఎన్ రెడ్డిలు బస్సులో డ్రైవర్లను తీసుకెళ్లి రహదారి నిబంధనలు పాటించాలని, వాటిపై మెలకువలు తెలియజేశారు.

విద్యార్థుల భద్రతపై చర్యలు చేపట్టాలి

– బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వల్లూరు బ్రహ్మయ్య



మాట్లాడుతున్న వల్లూరు బ్రహ్మయ్య

వైవీయూ: జిల్లాలోని వసతిగృహాల్లో విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని బీసీ బాలుర సమీకృత వసతిగృహంలో జీఓ ఎం.ఎస్. నెంబర్ 46 ప్రకారం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌పై బీసీ వసతిగృహ సంక్షేమ అధికారులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల నిర్వహణకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు. వివిధ స్థాయిల్లో వసతిగృహాలను పర్యవేక్షించాలని సూచించారు. హాస్టల్స్‌లో విద్యార్థుల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌లు డి. కృష్ణయ్య, నాగేందర్‌రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు నగర క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో చదువుతున్న శ్రీవల్లి (9వ తరగతి), రేష్మ (8వ తరగతి)లు అంతర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. వెంకటగిరిలో ప్రారంభమైన అండర్–14 అంతర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు వీరు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగరం సీఎస్ఐ హైస్కూల్ ఎదురుగా ఉన్న జగదీష్ న్యూరో కేర్ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించిందని వైద్యులు క్రాంతిరెడ్డి, మోహన మురళి కృష్ణ తెలిపారు. శుక్రవారం నగరంలోని రామకృష్ణ నగర్ వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పరీక్షలు చేసి చికిత్స అందజేశారు. అనంతరం వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

7న జాతీయ బీసీ మహాసభ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఈ నెల 7న తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగే జాతీయ బీసీ మహాసభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు గోవిందు నాగరాజు తెలిపారు. శుక్రవారం పాతరిమ్స్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహాదారు సుంకేసుల ఖాదర్ బాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి తొర్రి వేముల జయశ్రీ, జిల్లా గౌరవ అధ్యక్షులు గురుస్వామి, రాష్ట్ర కార్యదర్శి గువ్వల మధుసూదనరావు, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యాణ్ సుధాకర్ పాల్గొన్నారు.

ఇల్లు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్: చెర్లోపల్లి జగనన్న కాలనీలో తమ ఇంటిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్. పద్మశ్రీ, ఎస్. కిషోర్ కుమార్ కోరారు. శుక్రవారం వారు కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రం సమర్పించారు. చెర్లోపల్లి జగనన్న కాలనీ సర్వే నంబర్ 149, 150లో ప్లాట్ నంబర్–3006లో నిర్మించిన ఇల్లును అట్లూరు మండలం కొనరాజుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న క్రిష్ణమూర్తి, ఆయన భార్య క్రిష్ణవేణిలు ఆక్రమించారన్నారు. ఇటీవల తమ ఇంటికి ఎదురుగా ఉన్న కరెంటు స్తంభానికి వారు కరెంటు మీటర్ బిగించి, ఈ ఇల్లు మాదే...రూ.13 లక్షలు ఖర్చయ్యిందంటూ ఆక్రమిస్తున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్, డీఈఓ, సీకే దిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఇంటిని కూల్చి అక్రమ నిర్మాణం

– న్యాయం కోసం బాధితుడి వేడుకోలు

కడప రూరల్: ఇంటిని కూల్చి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కడప నగరం మేరీ నగర్‌కు చెందిన వృద్ధుడు డీ రామసుబ్బయ్య కోరారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 1996లో ప్రభుత్వం తనకు మేరీనగర్‌లో స్థలం మంజూరు చేయగా అందులో రేకుల ఇంటిని నిర్మించు కున్నామన్నారు. కొంత కాలంగా తన అనారోగ్యం కారణంగా స్థానికంగా ఉండడం లేదన్నారు. ఇది అదునుగా భావించి స్థానికంగా ఉన్న ఒకరు తన ఇంటిని కూల్చి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఈ అంశంపై స్పందనలో ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు ఆ స్థలం తనదిగా నిర్ధారించారని అన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని నాగరాజుపేట కమ్యూనిటీ సెంటర్ వైద్యులు హర్షవర్దన్ తెలిపారు. శుక్రవారం హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో నగరంలోని శేషగిరిరావు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. హర్షవర్దన్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లిపాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బషీర్ అహ్మద్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంపూర్ణ పోషణకు ప్రభుత్వం కృషి

కడప కార్పొరేషన్: తల్లీబిడ్డల సంపూర్ణ పోషణకు ప్రభుత్వం కృషి చేస్తోందని 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీహెచ్‌బీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలు, గర్భిణీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

కడప కార్పొరేషన్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్ టు రూల్ పాటించారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకూ మాత్రమే విద్యుత్ కార్యాలయాలు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో ఉద్యోగులు పనిచేశారు. 5 గంటల తర్వాత కార్యాలయాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్క్ టు రూల్ వల్ల ఏర్పడే సమస్యలకు యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య మాత తిరుణాల పోస్టర్ల ఆవిష్కరణ



తిరుణాళ్ల పోస్టర్లను విడుదల చేస్తున్న ఆరోగ్యమాత క్షేత్రం గురువులు

కడప కల్చరల్: కడప నగరం రైల్వేస్టేషన్ వద్ద గల ఆరోగ్యమాత పుణ్య క్షేత్రం తిరుణాల సెప్టెంబరు 7, 8 తేదీలలో నిర్వహించనున్నట్లు ఆ క్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాఫాఫాదర్ ఎండీ ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆ క్షేత్రంలోని తన కార్యాలయంలో ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ఉత్సవాల సంరంభం మొదలవుతుందన్నారు. సెప్టెంబరు 7,8 తేదీలలో మరియ మాత ఊరేగింపు, దివ్య బలిపూజ, వాక్య పరిచయ ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఈక్షేత్రం సహాయ డైరెక్టర్ రెవరెండు ఫాదర్ డాక్టర్ విల్సన్, మదర్‌లు, సిస్టర్‌లు, మరియ శాంతి దళం యువ శక్తి సభ్యులు శాంతి సొసైటీ సభ్యులు, తిరుణాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్‌లపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: వేంపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా ఓ టీడీపీ నేత వేసిన బృందావన కాలనీ, భారత్‌నగర్, హనుమాన్‌నగర్‌లో ఉన్న వెంచర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రివల్యూషన్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్, ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఏవోను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆర్‌వైయు, ఆర్ఎస్‌యూ నేతలు పాల్గొన్నారు.

పరిశోధనల్లో నాణ్యత ముఖ్యం

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : అత్యున్నత ప్రమాణాలు, లోతైన అధ్యయనం కలిగిన పరిశోధకులకే డాక్టరేట్‌లు అందాలని, యూజీసీ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలుచేయాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంచాలకులు ఆచార్య చంద్రఓబులరెడ్డి ఆధ్వర్యంలో పరిశోధనలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పరిశోధనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిశోధనలో నాణ్యత ప్రమాణాలను పెంచేందుకు శాఖలవారీగా రీసెర్చ్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యూజీసీ అకడమిక్ రెగ్యులేషన్స్–22 ప్రకారం పరిశోధన విధానంలో అత్యున్నత మార్పులు తెచ్చారన్నారు. పీహెచ్‌డీలో కొత్తగా ప్రవేశం పొందేవారికి 12 క్రెడిట్ పాయింట్స్ ఉండాలని పేర్కొన్నారు. పరిశోధకులు ప్రతినెలకొకసారి వారు చేస్తున్న పరిశోధనలు, వస్తున్న ఆవిష్కరణల గురించి చెప్పాల్సిన బాధ్యతను నిబంధనల్లో పొందుపరిచినట్లు తెలిపారు. రీసెర్చ్ మెథడాలజీ, రీసెర్చ్ పబ్లికేషన్స్, రీసెర్చ్ టైటిల్ ఎంపిక ఇలా ప్రతి అంశానికి క్రెడిట్‌లు నిర్ణయించారని తెలిపారు. క్రెడిట్‌లు పొంది, పీహెచ్‌డీ నివేదిక అందజేసిన వారికే డాక్టరేట్ లభిస్తుందన్నారు. డీన్‌లు, బీఓఎస్ చైర్మన్‌లు, పరిశోధక గైడ్లు, ప్రతి ఒక్కరూ పరిశోధన విలువలకు ప్రాధాన్యత ఇస్తూ పరిశోధక పత్రాలు ప్రామాణిక జర్నల్స్‌లో ప్రచురితమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, డీన్‌లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య పద్మ, ఆచార్య రమణయ్య, ఐక్యూఏసీ సంచాలకులు డా. సుబ్రమణ్యశర్మ, బీఓఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.